# 8 నూతన పాఠ్యపుస్తకంలోని పాఠాలకుపకరించే విశేషాంశాలు

© SCERT not to be republished

## విశేషాంశాలు - 8వ తరగతి

### 1. దుందుభి

ప్రకృతిని దైవంగా భావించే జాతి మనది. అందుకే మనకు నదులు, పర్వతాలు, చెట్లు మొదలైనవాటిని స్తుతిస్తూ ఎన్నో కావ్యాలు, గేయాలు, పాటలు, రచనలు వచ్చాయి. విశ్వనాథ సత్యనారాయణగారు కిన్నెరసాని అనే వాగును గురించి రాసిన పాటలు చాలా ప్రాచుర్యం పొందాయి. అబ్బూరి రామకృష్ణరావు గారి 'నదీసుందరి', బేతవోలు రామబ్రహ్మంగారి 'క్రొత్త గోదావరి', డా॥ యన్ గోపి గారి 'జలగీతం', డా॥ నాగభైరవ కోటేశ్వరరావు గారి 'నదిచెప్పని కథ' ఈ కోవలో వచ్చిన రచనలే.

### 2. మన సంస్కృతి

సంస్కృతి అనే భావనకు నిర్వచనాలనేకం. ఒక జాతి అనూచానంగా పాటిస్తున్న ఆచారాలు, విలువలు, సమాహార స్వరూపం – సంస్కృతి అనేది చాలామంది అంగీకరించిన విషయం "అంత కడివెడు పాలపై ఒక్కింత మీగడ పేరినట్లు మనకు మిగులును గతములోని మంచి అదియే సంప్రదాయము / సంస్కృతి. – అన్నది. సి.నా.రె.గారి మాట

### 3. అమ్మకోసం

**అమృతం** – క్షీరసాగర మథనంలో అమృతం పుట్టింది. ఇంద్రుడు దూర్వాసుడు బహూకరించిన పారిజాతం పూల దండను నిర్లక్ష్యం చేస్తాడు. దూర్వాసుడు ఆగ్రహించి దేవలోకమంతా కాంతివైభవహీనమయ్యేటట్లు శపిస్తాడు. దేవతలందరూ విష్ణువును ప్రార్థిస్తారు. విష్ణువు ఓషధులన్నీ తెచ్చి పాలసముద్రంలో వేసి చిలికితే అమృతం పుడుతుంది. దాన్ని సేవిస్తే కాంతి, వైభవం వచ్చి మరణం లేనివారమవుతారమని చెప్తాడు. ఈ పని దేవాసురులు కలిసి చేసినా, దేవతలే అమృతం స్వీకరిస్తారు.

**గరుత్మంతుడు** – పక్షిరాజు. అనూరుడి సోదరుడు. తల్లి వినత. కాబట్టి వైనతేయుడంటారు. తండ్రి కశ్యపుడు. ఇంద్రుణ్ణి ఓడించి, అమృతం తెచ్చి తల్లిని దాస్య విముక్తురాల్ని చేస్తాడు. ఇతడి రెక్కల గట్టితనంవల్ల సుపర్ణుడనే పేరు కూడా వచ్చింది. ఇతడు విష్ణువుకు వాహనం.

## 4. ఇల్లు – ఆనందాల హరివిల్లు

**మాతృస్వామ్యవ్యవస్థ** – తల్లి కుటుంబ యజమానిగా ఉండే వ్యవస్థని మాతృస్వామ్యవ్యవస్థ అంటారు. ఆదిమ సమాజంలో మాతృస్వామ్య వ్యవస్థ ఉండేది. ఆస్ట్రేలియా, సుమాత్ర, మెలానేసియా, ఫర్మోసా, మైక్రోనేసియా ప్రాంతాల్లో ఈ సంస్కృతి ఎక్కువ. భారత దేశంలో అస్సాం ప్రాంతంలోనూ, మలబార్ తీర ప్రాంతంలోను; ఉత్తర అమెరికాలోని దేశీయ తెగల్లో ఈ ఆచారం ఇప్పటికీ ఉంది.

**ఆశ్రమ ధర్మాలు** – ఇవి నాలుగు – బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాలు. బ్రహ్మచర్య వ్రతాన్ని ఉపనయనం అయినవాడు ఆచరించాలి. గురువు దగ్గర వేదాధ్యయనం చేయాలి. ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండాలి. ప్రాతస్సాయంసంధ్యలలో సూర్యాగ్నులనుపాసిస్తూ గురుపూజ చేస్తూండాలి. యాచించడం ద్వారా దొరికిన ఆహారాన్ని స్వీకరించాలి. గురువు అనుజ్ఞతో గృహస్థాశ్రమం స్వీకరించాలి. పితరులను–పిండదానంతో దేవతలను–యాగాలతో, ఋషులను–స్వాధ్యాయంతో, ప్రజాపతులను–సంతానాన్ని పొందడంతో, భూతాలను–బలులతో, ప్రపంచాన్ని–ప్రేమతో సంతోషపరచే గృహస్థు స్వర్గాన్ని పొందుతాడు. బ్రహ్మచారులకు, సన్యాసులకూ గృహస్థే ఆధారం. కాబట్టి వారిని గృహస్థు తప్పక ఆదరించాలి. గృహస్థాశ్రమం తర్వాత భార్యతో గాని, ఒంటరిగా గాని వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాలి. ఆహారంగా ఆకులూ, దుంపలూ, పళ్లు మాత్రమే స్వీకరించాలి. నేలమీదే నిద్రించాలి, చర్మాంబరధారి కావాలి, రోజుకు మూడుసార్లు స్నానం చేయాలి. దీని తర్వాతది సన్యాసాశ్రమం. ఈ దశకొచ్చేటప్పుడు భార్యను, ధనాన్ని వదిలేయాలి. సర్వజీవులను ఒకే రకంగా చూడగలగాలి. మనోవాక్కాయకర్మలతో ఏ జీవినీ హింసించకూడదు. బంధవిముక్తుడై సంసార జీవితం గడపాలి. గ్రామంలో ఒక రాత్రికి మించి, పట్టణంలో ఐదు రాత్రులకు మించీ ఉండకూడదు.

## 5. నీతిపరిమళాలు

**ఆదిశేషువు** – కద్రువ–కశ్యపుల సంతానంలో మొదటివాడు. తన తల్లి కద్రువ వినతపట్ల చేసే అక్రమానికి ఓర్చుకోలేక అనేక పుణ్య క్షేత్రాలలో తపస్సు చేసి బ్రహ్మవల్ల 'భూభారాన్ని వహించే శక్తి' మొదలైన వరాల్ని పొందుతాడు. ఇతడు భృగు మహర్షి శాపంవల్ల బలరాముడిగా అవతరిస్తాడు. శ్రీమహావిష్ణువు పానుపుగా ఉంటాడు. తెలుపు రంగులో ఉంటాడు.

**రసజ్ఞత** – సాహిత్యంలో ప్రతిపాదింపబడిన రసాన్ని గ్రహించగలిగిన నేర్పు.

**ఇంద్రియములు** – ఇవి రెండు రకములు – జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు. జ్ఞానేంద్రియాల నైదింటిని జ్ఞాన ద్వారాలుగా భావిస్తారు. ఇవి–చర్మం, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు. కర్మేంద్రియాలు ఐదు – ఇవి వాక్కు(మాట), పాణి(చేతులు), పాదం(కాళ్లు), పాయువు(మలమార్గం), ఉపస్థ (మూత్రమార్గం). మనస్సుతో కలిపి ఇవి ఏకాదశేంద్రియాలని పిలుస్తారు.

## 6. ప్రతిజ్ఞ

**శ్రమైక జీవన సౌందర్యం** – కష్టపడి పనిచేయడంలో ఉండే తృప్తి, సుఖం, సౌందర్యం.

**స్వస్తివాక్యములు** – శుభం కోరుతూ పలికే మాటలు. 'స్వస్తి తే మనుజవరేణ్య' అంటే రాజా నీకు శుభమగుగాక! 'స్వస్త్యస్తు! సుగుణోస్తు!' మొదలైనవి.

సూచన :– స్వస్తి చెప్పడం అనే పదబంధాన్ని 'ముగించడం / సగంలోనే ముగించడం' అనే అర్థంలో ఇప్పుడు వాడుతున్నారు.

**ధనిక స్వామి** – డబ్బున్నవాడు.

**యంత్రభూతం** – పారిశ్రామికీకరణలో భాగంగా కార్మిక వర్గం ఎక్కువ సమయం యంత్రాల దగ్గరే గడపాల్సి వచ్చినందువల్ల వాళ్ల పాలిట అవి భూతాల్లా / పీడించేవిగా మారాయి. ఆ అర్థాన్ని చెప్పటానికి ఈ పదాన్ని ప్రయోగించారు.

## 7. అజంతా చిత్రాలు

**అజంతా ఎల్లోరా గుహలు–**

<u>అజంతా</u> – ఇది ఇరవై తొమ్మిది గుహల సముదాయం. మహారాష్ట్రలో అజంతా అనేది ఒక గ్రామం పేరు. ఆ గ్రామం దగ్గర ఈ గుహలున్నాయి. 1819 లో వీటిని కనుక్కొన్నారు. ఈ గుహలు కుడ్యచిత్రాలకు ప్రసిద్ధి చెందాయి. బౌద్ధ జాతక కథలు ఇతివృత్తంగా అనేక వర్ణచిత్రాలు కనిపిస్తాయి. ఇందులోని చిత్రాలు క్రీ॥పూ॥ 200 నుండి క్రీ॥శ॥ 650 మధ్యకాలంనాటివి. పూర్వం ఈ ప్రాంతాన్ని కుంతల దేశం అని పిలిచే వారు. వాతాపిని రాజధానిగా చేసుకొని సత్యాశ్రయ పులకేశి ఈ రాజ్యాన్ని పరిపాలించాడు.

<u>ఎల్లోరా</u> – మహారాష్ట్ర లోని ఔరంగాబాద్ దగ్గర ఉన్న గ్రామం. గుహాలయాలకు ప్రసిద్ధి. ఇవి క్రీ॥శ॥ 5వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం మధ్యకాలంనాటివి. హిందూ, బౌద్ధ, జైన మతాలకు సంబంధించిన 19 దేవాలయాలు అక్కడ ఉన్నాయి. కైలాస దేవాలయం ప్రసిద్ధి చెందిన ఒక హిందూ దేవాలయం.

**జాతక కథలు** –మౌఖిక సంప్రదాయంలో పుట్టి లిఖిత సంప్రదాయంలోకి వచ్చిన కథలు జాతక కథలు. ఇవి బుద్ధుడి పూర్వజన్మల గురించి చెబుతాయి. వ్యక్తి పూర్ణ జ్ఞానాన్ని పొందడానికి ఒక జన్మ చాలదని బౌద్ధుల నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ కథలు ప్రతిఫలిస్తాయి. దాదాపుగా 500 జాతక కథలు ప్రస్తుతం లభ్యమౌతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ కథల్లో ప్రక్షిప్తాలు (చేర్పులు) అనేకం.

**వాఘోరా / వాఘిరా నది** – వింధ్యపర్వతశ్రేణిలో అజంతా పర్వతాన్ని రెండుగా చీలుస్తూ వాఘిరానది

ప్రవహిస్తూంటుంది. కొండమీదినుంచి కిందికి దూకేటప్పుడు ఇది వ్యాఘ్రాన్ని (పులిని) తలపిస్తూ ఉంటుంది. అందుకని వ్యాఘ్రానది అన్నారు. కాలక్రమంలో ఇది వాఘిరా, వాఘోరా గా మారింది. ఇది చేసే శబ్దం పులి గాండ్రింపులను గుర్తుకు తెస్తూంటుంది. దీని కెరటాలమీది వెలుగునీడలు బెబ్బులి చారలను తలపిస్తూంటాయి. దీనినుంచి వచ్చే సప్త జలపాతాలు పులిగంతుల (దూకుడు)లాగ ఉంటాయి. అలా ప్రవహించి ఇది తపతీనదిలో కలుస్తుంది.

## 8. హరిశ్చంద్రుడు

**షోడశ దానాలు** – గో, భూ, తిల, హిరణ్య, రత్న, విద్య, కన్యా, దాసీ, శయ్య, గృహ, అగ్రహార, రథ, గజ, తురగ, ఛాగ, (మేక) మహిషీ దానాలు.

**షట్చక్రవర్తులు** – హరిశ్చంద్రుడు, నలుడు, పురూరవుడు, పురుకుత్సుడు, సగరుడు, కార్తవీర్యుడు.

**బ్రహ్మరాత** – ప్రతిజీవినీ సృష్టించే బ్రహ్మ ఆ జీవుల జీవన విధానం, ఆయుర్దాయం మొదలైనవి నుదుట రాస్తాడని మన భారతీయుల విశ్వాసం. బ్రహ్మ ఏం రాశాడో ఆ జీవికి తెలియదు. ఎవరికీ తెలియదు. '*హరిణాపి హరేణాపి బ్రహ్మణాపి సురైరపి, లలాట లిఖితా రేఖా పరిమార్ష్టుం న శక్యతే* అనేది పండిత వాక్యం. ఎంత జాగ్రత్తగా పరిశీలించినా బ్రహ్మరాతను ఎవరూ చదవలేరు, తప్పించలేరు. అది ఏ లిపో కూడా ఎవరికీ తెలియదు. అందుకే అర్థంకాని రాతను బ్రహ్మరాత అనడం పరిపాటి.

**మేరుపర్వతం** – బంగారు పర్వతం. ఇది భూమి చుట్టూ ఒడ్డాణంలా ఉంటుంది. దీని చుట్టూ సూర్యచంద్రులు తిరుగుతూంటారు. దీని శిఖరాలపై దేవతలు విహరిస్తూంటారు. (బ్రహ్మాండ పురాణం)

మేరుపర్వతం కులపర్వతాలలో ఒకటి. ఉదయ, అస్త, హిమ, వింధ్య, మేరు, త్రికూట, లోకాలోక పర్వతాలు అనేవి సప్త కుల పర్వతాలు.

*శ్లో॥ మహేంద్రో మలయస్సహ్యా, శ్శుక్తిమాన్ గంధమాదనః*
*వింధ్యశ్చ పారియాత్రశ్చ, సప్తైతే కులపర్వతాః ॥ (త్రికాండశేషము)*

మరొక అభిప్రాయం ప్రకారం – మహేంద్రము, మలయము, సహ్యము, మాల్యవంతము, ఋక్షము, వింధ్యము, పారియాత్రము అనేవి సప్త కులపర్వతాలు.

**వజ్రాయుధం** – ఇంద్రుడి ప్రసిద్ధ ఆయుధం. వృత్రాసురుణ్ణి చంపడానికి బ్రహ్మ సలహా ప్రకారం దధీచిని ఆశ్రయిస్తారు దేవతలు. దధీచి అంతకు మునుపు తను ఉంచిన ఆయుధాలన్నీ తపశ్శక్తితో జీర్ణించుకొని ఉంటాడు. అప్పుడు దేవతల కోసం దధీచి తన శరీరాన్ని త్యజించి, శక్తిమంతమైన తన వెన్నెముకను ఆయుధంగా చేసుకొమ్మంటాడు. అదే వజ్రాయుధం.

## 9. చిన్నప్పుడే

**దండమండే** – దండము + అండి = దండమండి. నమస్కారమండీ అని అర్థం. అండి అనేది మాండలిక ప్రయోగంలో 'ఏ' చేరి 'అండే'గా మారి దండమండే అనే వచ్చింది.

**బందెలదొడ్డి** – పశువులను బంధించే దొడ్డి. అక్రమంగా ఎవరి పంటలనైనా, మొక్కలనైనా పశువులు మేస్తే వాటిని బంధిస్తారు. యజమాని గ్రామాధికారికి జరిమానా కడితేనే వాటిని విడిచిపెడతారు.

**సర్కారీ రకం** – ప్రభుత్వానికి కట్టే భూమి శిస్తు (భూమి పన్ను); సర్కార్ అంటే ప్రభుత్వం; రకం అంటే రొక్కం; అంటే ప్రభుత్వ ధనం (ఖజానా).

**శేగిదారు** – గుమాస్తా (LDC)

**గిర్దావరుబరులు** – రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అనే పేరుతో ఇప్పుడు చలామణి అవుతున్నారు. గతంలో గిర్దావర్ అని వ్యవహరించేవారు. గిర్దావరు బరులకు గతంలో గిర్దావర్ అని వ్యవహరించేవారు.

**సేక్‌సింది** – సుంకరి. పట్వారీ (గిర్దావర్) వద్దకు అని అర్థం.

**జంగల్** – అడవి; పశువులను మేపే ప్రాంతం.

## 10. ప్రాచీన సాహిత్యాధ్యయనం– ఆవశ్యకత

**కథాసరిత్సాగరం** – గుణాఢ్యుడు పైశాచిక భాషలో బృహత్కథను రాశాడు. దీన్ని బృహత్కథామంజరి పేరుతో సంస్కృతంలోకి క్షేమేంద్రుడు అనువాదం చేశాడు. దీనికి సోమదేవుడు చేసిన అనువాదాన్ని కథాసరిత్సాగరం అని పిలుస్తున్నారు. గుణాఢ్యుడు శివుడి పారిషదుడైన (ప్రమథగణంలోనివాడు) మాల్యవంతుని అవతారమని నమ్ముతారు.

**తూష్ణీంభావం** – తిరస్కార భావం.

**చక్రవర్తుల రాజగోపాలాచారి** *– (1879–1972).* కర్ణాటక రాష్ట్రం – బెంగళూరు వద్ద నున్న హొసూరులో జన్మించారు. 1921లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కు సెక్రటరీగా పనిచేశారు. భారత స్వాతంత్ర్యానంతరం 1948–1950 మధ్య భారతదేశానికి చివరి గవర్నర్‌జనరల్‌గా ఈయన పనిచేశారు. కేంద్రంలో హోం శాఖా మంత్రిగా (1950–1951), మద్రాసు ముఖ్యమంత్రి (1952–1954)గా పనిచేశారు. 1959లో 'స్వతంత్ర' పార్టీ స్థాపించారు.

**డిస్కవరీ ఆఫ్ ఇండియా** – ప్రజాస్వామ్య వాది, భారత తొలి ప్రధాని అయిన జవహర్‌లాల్ నెహ్రూ ఆంగ్లంలో అనేక గ్రంథాలు రచించాడు. తను రాసిన స్వీయచరిత్రకు కొనసాగింపుగా మరో రచనకు సిద్ధమయ్యారు. తను ప్రేమించే భారతదేశాన్ని గురించి రాస్తే బాగుంటుందని '*ద డిస్కవరీ ఆఫ్ ఇండియా*' రచనకు పూనుకున్నారు. ఈ గ్రంథరచనలో అబుల్ కలాం ఆజాద్, గోవింద్ వల్లభ పంత్ వంటి స్వాతంత్ర్యసమరయోధులు తమ తోడ్పాటునందించారు. ఈ పుస్తకాన్ని గురించి నెహ్రూగారే ఇలా చెప్పారు. 'నేనీపుస్తకాన్ని అహమ్మద్ నగర్ కోటలో ఉండగా 1944 ఏప్రిల్ నుంచి

సెప్టెంబరు వరకు ఐదు నెలల్లో వ్రాశాను. ఖైదులో ఉన్న సహచరులు కొందరు అనేక సూచనలు చేశారు. వీటన్నిటి ఫలితంగా భారతీయ చరిత్ర సంస్కృతుల వివిధ దృక్పథాల గురించి నా మనసులో మసక మసకగా ఉన్న రూపాలు విశిష్ట రూపం దాల్చాయి'.

**కబంధహస్తాలు** - ఒకరి బంధనాలలో చిక్కుకోవడం

**పరశురామ ప్రీతి** - అగ్నికి ఆహుతి కావడం

**చుప్పనాతి** - ఓర్వలేని తనమున్న (స్త్రీ) వ్యక్తి

**హనుమంతుని తోక** - ఎడతెగని విషయం

**రామబాణం** - తిరుగులేని సాధనం లేదా ఉపాయం.

**విశ్వామిత్ర సృష్టి** - కృత్రిమ కల్పన

**భగీరథ ప్రయత్నం** - అతికష్టంమీద చేసే పని

**బలి** - అన్యాయానికి గురికావడం

**నైవేద్యం** - నివేదించడం - భోజనంచేసేముందు ఆహారపదార్థాలను దైవానికి నివేదించడం / అక్రమంగా కేటాయించడం / తినటం (ఆధునికార్థంలో)

**యజ్ఞం** - దేవతలను గురించి చేసే విశేష అగ్నికార్యం

**సర్పయాగం** - ఒక్కడిగురించి చాలామందిని బలితీసుకోవడం

**మారణహోమం** - భీతావహ వాతావరణం కల్పించి, విధ్వంసం సృష్టించడం

**స్వర్గం-నరకం** - సుఖదుఃఖాలు / మంచిచెడులు

**రావణాసురుడి కాష్ఠం** - అంతులేని, రగులుతూ ఉన్న వివాదం

**చిదంబర రహస్యం** - అంతుచిక్కని విషయం

**లక్ష్మణరేఖ** - ఎదుటివారి శ్రేయస్సుకొరకు హద్దులేర్పరచడం

**హిరణ్యాక్షవరాలు** - గొంతెమ్మ కోరికలు, అత్యాశాపూరితాలైన కోరికలు

**నల-భీమ పాకం** - రుచికరమైన వంట (మగవారు చేసినది)

**భీష్మప్రతిజ్ఞ** - దృఢమైన / వీగిపోని/ ఆడినమాట తప్పని ప్రతిజ్ఞ లేదా శపథం

**కుబేరసంపత్తి** - అపారమైన ధనం కలిగి ఉండటం

**ఇంద్రభవనం** - అన్ని సౌకర్యాలూ ఉన్న భవనం

**లక్ష్మీపుత్రుడు** - సహజంగానే ధనవంతుడు

**దేవేంద్ర పదవి** - ఉన్నతమైన, వైభవోపేతమైన పదవి

**పుష్పకవిమానం** - ఎందరికైనా చోటుండే ప్రదేశం

**ఘోషయాత్ర** - చెరపకురా చెడేవు అనే అర్థంలో దీన్ని వాడతారు.

పాండవులను అవమానపరచాలనే ఉద్దేశ్యంతో బయలుదేరిన దుర్యోధనుడు తానే

అనేక సందర్భాలలో భంగపడ్డాడు, గంధర్వుల చేతిలో ఓడిపోయాడు.

**ధర్మరాజు** - ధర్మాన్ని తప్పక చరించేవాడు, ఆడినమాట తప్పనివాడు, అధర్మానికి తావివ్వనివాడు. మంచివాడు / అమాయికుడు.

©SCERT not to be republished

**ధర్మవ్యాధుడి కథ** – మిథిలా నగరంలో బోయవాడు. కసాయి వృత్తిలో ఉండికూడా ధర్మంగా వ్యవహరించాడు. ధర్మాచరణకీ, కులవృత్తికీ సంబంధం లేదని నిరూపించాడు. కర్తవ్యనిర్వహణ అతిముఖ్యమైన విషయం అని ఇతడి జీవితం తెలుపుతుంది. కౌశికుడనే బ్రాహ్మణుడు కూడా ఇతడి దగ్గర ధర్మోపదేశం పొందాడు. –భారతం.

## 12. సముద్రలంఘనం

**రామాయణ కథ సంగ్రహంగా** – రామాయణం మహర్షి వాల్మీకి రాసిన ఆదికావ్యం. ఇక్ష్వాకు వంశంలో దశరథ మహారాజుకు పెద్ద కొడుకుగా శ్రీరామచంద్రుడు పుట్టాడు. విశ్వామిత్రుని శిష్యునిగా బల, అతిబల విద్యలు నేర్చి, తాటకను పరిమార్చి, జనక కన్య సీతను వివాహమాడాడు. పినతల్లి కైక ఆజ్ఞ మేరకు 14 సంవత్సరాలు అరణ్యవాసం చేశాడు. ఈ సమయంలో రావణుడు సీతను లంకకు ఎత్తుకు పోయి చెరలో బంధించాడు. కపివరులు, హనుమంతుని సహాయంతో సముద్రానికి వారధి నిర్మించి, లంకలోకి ప్రవేశించి రావణుని చంపి చెరలోఉన్న సీతను విడుదల చేశాడు. ఏకపత్నీ వ్రతం, పితృవాక్య పరిపాలన, చక్కటి రాజ్యపాలన మొదలైన విషయాలను ఆచరణలో పెట్టి మానవాళికి ధర్మమూర్తిగా, ఆదర్శమూర్తిగా, పురుషోత్తముడిగా నిలిచాడు శ్రీరాముడు.

**హనుమంతుడు** – అంజనీ–కేసరుల పుత్రుడు. శ్రీరామచంద్రుని నమ్మిన బంటు. లంకను కాల్చి, జంబుమాలినిని, రావణకుమారుడైన అక్షకుమారుణ్ని మొదలైన వారిని సంహరించాడు. లంకలో సీతమ్మ జాడ తెలిసికొని, శ్రీరామచంద్రుని అంగుళీయకాన్ని సీతమ్మకూ, సీతమ్మ చూడామణిని శ్రీరామచంద్రునకు ఇచ్చాడు. రామరావణ యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛాగ్రస్తుడైనప్పుడు సంజీవిని పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుని ప్రాణాలు కాపాడాడు. నిరంతర రామనామజపపరాయణుడు, చిరంజీవి, భవిష్యద్బ్రహ్మ.

ఏ అక్షరాన్ని పలకడానికి ఎంత గాలిని వాడాలో, ఎంత అల్పంగా లేదా ఎంత దృఢంగా ఆ అక్షరాన్ని పలకాలో ఆ విషయం తెలిసి, అంత గాలినే వాడుతూ, అంతసేపటిలోనే స్ఫుటంగా విస్పష్టంగా మళ్లీ మళ్లీ వినాలనిపించేలా ప్రతి అక్షరాన్నీ పలికేందుకు సహకరించే ఉత్తమ హనువులు (దౌడలు) కలవాడని 'హనుమాన్' అనే పదానికి అర్థం. దీన్ని రాముడు కూడా అంగీకరించినట్లు ఆధారాలున్నాయి.

# విశేషాంశాలు - 9వ తరగతి

## 1. శాంతి కాంక్ష

**విదురుడు** – అంబిక పరిచారికకు, వ్యాసుడికి పుట్టినవాడు. మాండవ్యుని శాపం వల్ల యముడే విదురుడిగా పుడతాడు. పాండవుల పట్ల కౌరవులు చేసే దురాగతాలు తెలిసికూడ మౌనంగా ఉండేవాడు. పాండవులను లక్క ఇంటినుండి రక్షిస్తాడు. మాయా ద్యూతానికి అంగీకరించడు. కాని, ధృతరాష్ట్రాదులు వినకపోవడంతో వెళ్లి పాండవులను తీసుకువస్తాడు. ద్రౌపదిని సభకు తీసుకునిరావడానికి తిరస్కరిస్తాడు. యుద్ధ సమయంలో తీర్థయాత్రలకు వెళ్తాడు. తపస్సు చేసి యమధర్మరాజులో లీనమౌతాడు.

**పాండురాజు** – అంబాలికా వ్యాసుల కొడుకు. పాండవుల తండ్రి. మాద్రి కుంతుల భర్త. వేటకు వెళ్లి మృగాల రూపంలో ఉన్న కిందముడనే మునిని, అతని పత్నిని చంపుతాడు. ముని మరణిస్తూ 'నీ భార్యను తాకితే చనిపోతా'వని శాపమిస్తాడు. ఇతడు అరణ్యంలోనే తపస్సు చేసుకుంటూంటాడు. సంతానాన్ని పొందమని కుంతిని ఆజ్ఞాపిస్తాడు. ఆమె పాండవులలో ధర్మరాజు, భీముడు, అర్జునులకు జన్మనిస్తుంది. మాద్రికి కూడ అశ్వినీ దేవతలవల్ల నకుల సహదేవులు పుడతారు. ఒకసారి మాద్రిని తాకడం వల్ల పాండురాజు మరణిస్తాడు.

**సుయోధనుడు** – దుర్యోధనుడి అసలు పేరు. గాంధారి ధృతరాష్ట్రుల కొడుకు, కలి అంశతో పుడతాడు. భీముడిని తిప్పలు పెడతాడు. కర్ణుడికి అంగరాజ్యాన్నిస్తాడు. పాండవులను లక్క ఇంటిలో చంపాలని ప్రయత్నిస్తాడు. రాజసూయానికి వెళ్లి

© SCERT not to be republished

మయసభలో భంగపడతాడు. మాయా ద్యూతంతో ధర్మరాజునోడించి పాండవులను అరణ్యానికి పంపిస్తాడు. కురుక్షేత్ర యుద్ధంలో భీముని చేతిలో మరణిస్తాడు. ఇతడు దురహంకారి, దురభిమాని, ఈర్ష్యాసూయలకు నిలయుడు.

**2. స్వభాష**

**బర్కు** - ఎడ్మండ్ బర్క్ (1729-1797). ఐర్లాండు కవి. వక్త. రాజకీయ సిద్ధాంత కర్త. తాత్త్వికుడు. ఇంగ్లండులో స్థిరపడ్డాడు. బ్రిటన్ పార్లమెంటులో విగ్ పార్టీ తరపున చాల కాలం సేవలందించాడు.

**సిసిరో** - (106 బి.సి. - 43 బి.సి.) రోమ్ దేశపు తాత్త్వికుడు, న్యాయవాది, వక్త, రాజకీయ సిద్ధాంతవేత్త.

**డిమాస్థనీసు** - (384 బి.సి. - 322 బి.సి.) ప్రసిద్ధ గ్రీకు వక్త. ఉపన్యాస రచయితగా (లోగోగ్రాఫర్) జీవితం సాగించాడు.

**గ్లాడ్టన్** - (విలియమ్ ఇవార్ట్ గ్లాడ్‌స్టన్) (1809-1898). ఒకప్పటి ఇంగ్లండు ప్రధాని.

**కాలాంబర కవచ ధారి** - నల్ల కోటు వేసుకున్న వ్యక్తి. లాయరు. న్యాయవాది.

**సాబాలైన** - సగము పాలైన, సగమైనా

**ప్యారడైజ్ లాస్ట్** - 17 వ శతాబ్ది కవి జాన్ మిల్టన్ రాసిన ఇతిహాస రచన. 1667లో అచ్చయింది. బైబిలు లోని ఒక కథాంశం దీని ఇతివృత్తం. సాతాను ప్రభావం వల్ల ఆదాము, అవ్వలు పతనం కావడం, ఈడెన్ గార్డెన్ నుంచి బహిష్కరింప బడటం ఇందులో వర్ణించబడింది.

**యంబ్రహ్మవేదాంత** - దీని పూర్తి పాఠం.

యం బ్రహ్మ వేదాంత విదో వదంతి
పరే ప్రధానం పురుషం తతన్యే
విశ్వోద్గతే కరణం ఈశ్వరం వా
తస్మై నమో విఘ్న వినాశాయ.

**అయాంబిక్ మీటర్** - (I - amb) - a metrical foot consisting of an un stressed syllable followed by a stressed syllable or a short syllable followed by a long syllable as in 'delay'.

**హగుంసస్శుచిష** - వేదమంత్రం. సంధ్యావందనంలో ఈ మంత్ర ప్రసక్తి కనిపిస్తుంది. దీని పూర్తి పాఠం ఇది -

" *హగ్ం స శ్శుచిష ద్వసు రంతరిక్షస ద్ధోతా వేదిష దతిథిర్దురోణసత్ నృషద్వరసదృతసద్వ్యోమసదబ్జా గోజా ఋతజా-ద్రిజా ఋతమ్ బృహత్* "

శుచిషత్ = పరిశుద్ధమైనదానియందుండువాడు; వసుః = జగమంతా ఉండేవాడు; అంతరిక్షసత్ = ఆకాశంలో ఉండేవాడు; హోతా = అగ్ని రూపంలో తేజంగా ఉండేవాడు; వేదిషత్ = పరిష్కృత ప్రదేశాలయిన వేదులయందుండేవాడు; అతిథిః దురోణసత్ = బ్రహ్మాండములనెడి గృహములకు అతిథిగా ఉండేవాడు; నృషత్ = వైశ్వానర రూపంలో ప్రజలయందుండేవాడు; వరసత్ = శ్రేష్ఠములయిన తీర్థాదులలో ఉండేవాడు; ఋతసత్ = యజ్ఞములయందుండేవాడు; వ్యోమసత్ = ఆకాశంలో సూర్యరూపంలో ఉండేవాడూ; అబ్జాః = నీటియందుండేవాడూ; గోజాః = గోవులయందుండేవాడూ; ఋతజాః = యజ్ఞాలలో భోక్తగా ఉండేవాడూ; అద్రిజాః = పర్వతములయందుండేవాడూ అయిన ; హగ్ం సః = సర్వ వ్యాపకుడయిన పరమాత్మ; బృహత్ = అధికమయిన; ఋతమ్ = ఉపాసనాత్మకమయిన సత్యము.

**ఇన్మెమోరియం / మ్యూజిక్** – ఇది ఇన్‌మెమోరియం ఎ.హెచ్.హెచ్., అనేది ఆల్‌ఫ్రెడ్ లార్డ్ టెన్నిసన్ రాసిన కవిత. 1849లో దీని రచన పూర్తయింది. కవి స్నేహితుడు ఆర్థర్ హెన్రీ ఆత్మ శాంతికోసం రచయిత సంగీతాత్మకంగా రాసిన విషాదగీతమిది. దీని అసలు పేరు 'ద వే ఆఫ్ ద సోల్'.

✦ **కంకంటివారు : కంకంటి పాపరాజు**

పదిహేడో శతాబ్ది తెలుగు కవి. ఉత్తర రామాయణాన్ని ప్రౌఢ ప్రబంధంగా రచించి పండితుల ప్రశంసలందుకున్నాడు. ఈ గ్రంథం తెలుగు దేశంలో చాలా కాలంగా పఠన పాఠనాదులలో ఉంది.

✦ **జనక చక్రవర్తి**

హ్రస్వరోముడి కొడుకు. శీరధ్వజుడనే పేరుకూడ ఉంది ఇతనికి. మిథిలకు రాజు. రత్నమాలకు భర్త. కుశధ్వజుడి సోదరుడు. కొడుకుకోసం యజ్ఞం చేయదలచి భూమిని దున్నుతుంటే సీత దొరుకుతుంది. రాజర్షి.

✦ **సీతారామాంజనేయ కవి**

పరశురామపంతుల లింగమూర్తికి మరోపేరు సీతారామాంజనేయ కవి.

18వ శతాబ్ది పూర్వార్థంలోనివాడు.  భక్తుడు, యోగి, మహాకవి, వేదాంత ప్రబంధ రచయిత. మహారాష్ట్ర నుంచి ఇక్కడకు వచ్చిన పరశురామ పంత్ అనే వంశంలో జన్మించిన వాడు లింగమూర్తి. లింగమూర్తి, గురుమూర్తి ఇతని బిరుదులు. భారద్వాజస గోత్రుడు. ఓరుగల్లులోని మట్టివాడ ఈయన స్వస్థలం. దత్తాత్రేయ గురు పరంపరలో చివరివాడైన మహాదేవయోగి అనే సిద్ధుడి శిష్యుడు ఈ లింగమూర్తి. ఈయన సీతారామాంజనేయ సంవాదం రాశాడు.  బ్రహ్మాండపురాణంలో ఉన్న అధ్యాత్మరామాయణము బాలకాండలోని శ్రీరామ హృదయానికి మహాభాష్యరూపం సీతారామాంజనేయ సంవాద ప్రబంధం. మొదటి 3 ఆశ్వాసాలు తారక, సాంఖ్య, అమనస్క యోగాలను వివరిస్తాయి. ఈ కావ్యంలో సారాలంకార ప్రయోగం ఎక్కువ – భాగవతంతో సమానంగా ఈ గ్రంథం పల్లెటూళ్లలో కూడ వ్యాపించి విశేష ఆదరణ పొందింది.

**3. తాండవం**

ఒక ఉద్ధత నృత్య రీతి. పురుషులు చేస్తారు. పాద తాడనం తీవ్రంగా ఉండటం దీని లక్షణాలలో ఒకటి. కృష్ణుడు కాళీయుడి పడగల మీదా, శివుడు ప్రళయ కాలంలోను చేసిన నృత్యాన్ని పేరుతోనే పిలుస్తారు. ఆనంద తాండవం... ఇత్యాది భేదాలు కూడా ఉన్నాయి.

**4. ప్రేరణ**

**టాల్‌స్టాయ్** – (1829–1910) –రష్యన్ రచయిత. మహాత్మా గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ లాంటి వాళ్లను కూడ ఇతని రచనలు ప్రభావితం చేశాయి. 'వార్ అండ్ పీస్' (యుద్ధము – శాంతి), అన్నా కెరీనా ఇతని ప్రసిద్ధ రచనలు.

**స్కాట్** – మెలీసా స్కాట్ (1960–2006) సైన్స్ ఫిక్షన్ రాయడంలో ప్రసిద్ధురాలు.  'నైట్ స్కై మైన్' 'డ్రీమ్ షిప్స్' మొదలైనవి ఈమె రచనలు.

**హార్డే** – 1840–1928 (థామస్ హార్డీ), ఆంగ్ల నవలా రచయిత. వర్డ్స్‌వర్త్ ప్రాకృతికవాదానికి బాగా ప్రభావితుడయ్యాడు. దాన్ని బాగా ప్రచారం చేశాడు. 'ఫార్ ఫ్రమ్ మాడింగ్ క్రౌడ్' ఇతని రచన.

**కంచిపరమాచార్య** – జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి (1894 – 1994) కంచి కామకోటి పీఠానికి 68వ జగద్గురువు. ఈయనను పరమాచార్య / మహాస్వామి అని పిలుస్తుంటారు. తమిళనాడులోని విలిప్పురంలో కన్నడ బ్రాహ్మణ దంపతులకు అనురాధా నక్షత్రంలో జన్మించారు. తల్లిదండ్రులు స్వామినాథన్ అని పేరు పెట్టారు. స్వామివారి జాతకాన్ని చూసిన ఒక జ్యోతిష్కుడు పిల్లవాడని కూడా చూడకుండా సాష్టాంగనమస్కారం చేశారుట. భవిష్యత్‌లో ప్రపంచం మొత్తం

ఇతని కాళ్ళముందు సాష్టాంగ పడుతుంది. నేనప్పుడు ఉండను కాబట్టి ఇప్పుడే ఆ పని చేస్తున్నాని చెప్పారుట. స్వామివారు తమ 13వ ఏటనే కంచి పీఠాధిపతి అయ్యారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి అనే ఆశ్రమనామాన్ని స్వీకరించారు.

**ఏరోనాటికల్ ఇంజనీరింగ్** - ఏరోనాటిక్స్ పౌర, సైనిక విమానాల రూపకల్పన, తయారీ, నిర్వహణ, పరీక్షలకు సంబంధించినది. ఏరో డైనమిక్స్ అంశాలయిన స్ట్రక్చరల్ డిజైనింగ్, ప్రపల్షన్ ఇంజన్స్, నావిగేషన్, కమ్యూనికేషన్ మొ॥వి కూడ ఇందులో భాగాలే.

## 5. పద్యరత్నాలు

**గజస్నానం** - ఏనుగు చాల సేపు చెరువులో స్నానం చేసి బయటికి వస్తుంది. వెంటనే తలపై మట్టిని, దుమ్మును చల్లుకుంటుంది. అంటే ఫలితం లేని పని. అలాగే భక్తి లేనివాడు ఎన్ని నదుల్లో స్నానం చేసినా ఫలితం ఉండదు. ఎన్ని మంత్రాలు జపించినా నిష్ప్రయోజనమే. ఎన్ని హెూమాలు చేసినా నిరర్థకమే.

## 6. ప్రబోధం

**తెలుగు అంకెలు** - **1** - ౧; **2** - ౨; **3** - ౩; **4** - ౪; **5** - ౫ **6** - ౬; **7** - ౭; **8** - ౮; **9** - ౯;

## 7. సీతక్క పెండ్లి

**అష్రఫీ** - అరబ్బుల చలామణిలో ఉన్న బంగారు నాణెం; మేలిమి గుణాలున్న వ్యక్తిని ఇలా పిలవడం పరిపాటి.

## 8. రుబాయీలు

**అద్వైతం** - జీవుడు దేవుడు ఒకటే అని చెప్పేదే అద్వైతం. ప్రాణశక్తి విశ్వమంతా వ్యాపించి ఉంటుందని అదే భగవత్స్వరూపమని దానివల్లే ప్రాణి కదలికలు ఏర్పడుతున్నాయని అద్వైతం చెబుతుంది. సకల ప్రాణులలో ఉన్న చైతన్య శక్తినే పరమాత్మగా / భగవంతుడిగా అద్వైతము గుర్తిస్తుంది. అద్వైత సిద్ధాంత కర్త శ్రీ ఆదిశంకరులు.

## 9. చూడడమనే కళ

**జంబోరి** - స్కౌట్ కార్యక్రమాల్లో ఒకటి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు ఒకచోట చేరడం.

## 11. ఈప్స

**భావుకుడు** - సాధారణ వ్యక్తికి కనిపించని కొన్ని సామ్యాలను, వైరుధ్యాలను భౌతిక ప్రపంచంలో చూడగలిగిన వాడిని భావుకుడు అంటారు. భావుకుడికి ఊహాశక్తి ఎక్కువ. (సంస్కృతంలో భావుకుడంటే బావమరది అని అర్థం.)

**తార్కికుడు/తర్కం** - ఇది తర్క శాస్త్ర ముఖ్య అంశాలలో ఒకటి. పాశ్చాత్య తర్కం అరిస్టాటిల్‌తో ప్రారంభమయిందని భావిస్తున్నారు. దీనిలోని గమనాత్మకంగా సాగే అనుమాన ప్రక్రియ ప్రాధాన్యం వహిస్తుంది. ఇది ఆకృతిక తర్కం. దీనిలో న్యాయ ప్రయోగ విషయం కంటె ఆకృతి ముఖ్యం. నిగమన తర్కం విజ్ఞానశాస్త్ర సముపార్జనకు వినియోగంచేదని భావించిన బేకన్ ఆగమన తర్కాన్ని అభివృద్ధి చేశాడు. ఇది అనుభవాత్మకంగా సాగుతుంది. దీనిలో విషయం ప్రాముఖ్యం వహిస్తుంది. తరువాత తర్కం గణితాత్మకమయి సాంకేతిక తర్కంగా అభివృద్ధి చెందింది. భారతీయ దర్శనంలో తర్కాన్ని న్యాయమంటారు. షడ్దర్శనాలలో న్యాయ దర్శన మొకటి. నైయాయికులు న్యాయాన్ని బాగా అభివృద్ధి చేసారు. బౌద్ధంలోను, జైనంలోను తర్కం ప్రముఖస్థానమాక్రమిస్తుంది. మాధ్యమికుల శూన్య వాదంలోనూ, జైనుల సప్త భంగినయంలోనూ శంకరుని అద్వైత ప్రతిపాదనం లోను భారతీయ తర్కం పరాకాష్ఠనందింది.

**సంజీవిని** - ఓషధి. మరణించిన వారిని బ్రతికించగలదు. ద్రోణ, చంద్ర పర్వతాలపై ఉంటుంది. సుషేణాదులకు ఈ విషయం తెలుసు. రామ రావణ యుద్ధంలో లక్ష్మణాదులు మూర్ఛిల్లినపుడు హనుమంతుడు దీనిని తీసుకువచ్చి వారిని బ్రతికిస్తాడు.

**గుదిబండ –** చెప్పినమాట వినని పశువుల మెడకు ఒక కఱ్ఱ తగిలిస్తారు. ఇదే గుదిబండ. తన అభివృద్ధికి అడ్డం వచ్చే వారిని, పనులను ఆటంకపరచేవారిని గుదిబండలాగ తయారయ్యాడు అని చెప్పడం పరిపాటి.

**శిబిశరీరం –** త్యాగానికి, దానానిని ప్రతీక. శిబి ఉశీనరుడి కొడుకు. ఇతడి పరిపాలనలో రాజ్యం సుభిక్షంగా ఉండేది. శరణాగత రక్షణకు ప్రసిద్ధి చెందాడు. ఇంద్రుడు డేగగాను, అగ్ని పావురంగాను మారి ఇతని త్యాగ నిరతిని పరీక్షించారు. ఇతడు తన శరీరాన్ని కూడ కోసి ఇవ్వడానికి వెనకాడకపోవడంతో సంతోషించి అనేక వరాలనిచ్చి వెళ్లారు. – భారతం / భాగవతం.

**బలిత్యాగం –** ఇతడికే మహాబలి అనే పేరుకూడ ఉంది. రాక్షసుల రాజు. విరోచనుడి కొడుకు. భార్య అశన. కొడుకు బాణుడు. కూతురు రత్నమాల. ఇతనికి నివాత కవచులనే నాలుగు కోట్లమంది రాక్షసులు పుడతారు. వామనుడివల్ల పరాజితుడై పాతాలంలో నివసిస్తాడు. ఆడినమాట తప్పకపోవడానికి, దానానికి బలి ప్రసిద్ధి చెందాడు. తన గురువైన శుక్రాచార్యుడు వద్దని చెబుతున్నా వినకుండా వామన రూపంలో వచ్చిన విష్ణువుకు మూడడుగుల నేల ధారపోశాడు. వామనుడు త్రివిక్రముడై ఒక అడుగు భూమిమీద, మరొక అడుగు ఆకాశం మీద వేసి, మూడో అడుగు ఎక్కడ పెట్టాలంటాడు. తన నెత్తిపై పెట్టమని చెప్పాడు బలి. దానికోసమే ఎదురు చూస్తున్న వామనుడు బలిని పాతాళానికి అణగదొక్కుతాడు. – భాగవతం.

**పాతాళం –** పాతాళం (భూమికింద ఉన్న) ఏడు అధో లోకాలలో చివరిది. నాగుల నివాస స్థానం. అతల, వితల, సుతల, తలాతల, రసాతల, పాతాళ లోకాలు భూమి కింద ఉన్నాయి. వీటిని మయుడు నిర్మించాడు. – దేవీ భాగవతం.

## 12. బతుకు పుస్తకం

**అతడు – ఆమె –** ఉప్పల లక్ష్మణ రావుగారు రాసిన నవల.

**రీడబిలిటీ –** పుస్తకం మొదటినుంచి చివరివరకు ఆగకుండా చదివించే గుణాన్ని పఠనీయత (రీడబిలిటీ) అంటారు.

**రికామి –** ఏ విధమైన బరువు బాధ్యతలు లేకుండా స్వేచ్ఛగా తిరిగేవాడు.

**జిజ్ఞాసువు –** తెలుసుకోవాలనే కోరిక కలవాడు. 'జ్ఞాతుం ఇచ్ఛ జిజ్ఞాస'. జిజ్ఞాస కలవాడు జిజ్ఞాసువు.

**సహృదయుడు –** సహృదయుడనగా సమానమైన (కవి, నాయకుల హృదయంతో సమానమైన) హృదయం కలవాడని అర్థము. అభినవగుప్తుడు ధ్వన్యాలోక లోచనంలో సహృదయ పదాన్ని ఇలా నిర్వచించారు. 'ఏషాం కావ్యానుశీలనవశాత్ విశదీభూతే మనో ముకురే వర్ణనీయ తన్మయీభవన యోగ్యతా తే హృదయ సంవాద భాజః సహృదయాః' – అనగా దృశ్య / శ్రవ్య కావ్యాలను పరిశీలించడం వల్ల హృదయం బాహ్య విషయ జ్ఞానం నుంచి ముక్తమై శుద్ధమైన అద్దంలాగ భాసిల్లుతుంది. అప్పుడు ఆ కావ్యంలో వర్ణితములయిన విభావాదులు సూటిగా దాంట్లో ప్రతిఫలిస్తాయి. అప్పుడు సహృదయుడికి కావ్యగత నాయకాదులతో తన్మయత్వము (అభేద ప్రతిపత్తి) కలుగుతుంది. అలాంటివారే సహృదయులు.

> "యస్తుష్టౌ తుష్టిమాప్నోతి శోకే శోకముపైతి చ
> క్రోధే కృద్ధో భయే భీరుస్సశ్రేష్ఠః ప్రేక్షకః స్మృతః" – కావ్యాలంకార సంగ్రహం

–ఎవడు నాయకుని తుష్టియందు తాను తుష్టినందునో, శోకమునందు శోకము చెందునో, క్రోధమున కృద్ధుడగునో, భయమున భయపడునో వాడు శ్రేష్ఠుడయిన ప్రేక్షకుడు. వాడే సహృదయుడు.

**ఆస్తికులు –** భగవంతుడు ఉన్నాడని నమ్మేవారు.

**హేతువాదులు –** హేతువే జ్ఞానానికి మూలం అని చెప్పే వాదం. సత్యాన్ని తెలుసుకోవాలంటే హేతువే మార్గం. హేతువే వాస్తవం ఏమిటనే విషయాన్ని నిర్ణయిస్తుంది. అన్నిటికన్న ఆలోచన, తర్కం ముఖ్యం. కేవలం ఇంద్రియాల ద్వారాను,

©SCERT not to be republished

సంప్రదాయాలద్వారాను, దేవదూతల జ్ఞాన బోధ ద్వారాను, జ్ఞానం వస్తుందని భావించి దానిమీదే ఆధారపడకుండా, దానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, 'హేతువు' 'తర్కం' అనే అంశాలకే ప్రాధాన్యత ఇవ్వాలనే ధోరణి. హేతువాద దృక్పథంతో సంప్రదాయ భావాలనూ, సాహిత్య ప్రక్రియలనూ విలువలనూ తిరస్కరించిన రచయితలను హేతువాద రచయితలు అన్నారు. వీళ్లు ముఖ్యంగా మత గ్రంథాలనూ, ప్రాచీన కావ్యాలనూ, సంప్రదాయ గ్రంథాలనూ, సమస్తాన్నీ హేతువాద దృష్టితో విమర్శించడమో; తిరిగి రాయడమో చేశారు. అలా, హేతువాదం కూడ ఆధునికసాహిత్యంలో ఒక ముఖ్య భాగం అయింది.

**పెట్టుబడిదారీ వ్యవస్థ –** ఇది ఒక ఆర్థిక వ్యవస్థ. దీంట్లో ఉత్పత్తి సాధనాలు వ్యక్తిగత యాజమాన్యంలో ఉంటాయి. 'లాభం'కోసం పనిచేస్తాయి. ఈ వ్యవస్థలో ఆదాయం రెండు రూపాల్లో ఉంటుంది. ఒకటి లాభం, రెండోది వేతనాలు. సహజ వనరులపై నియంత్రణ ద్వారా, వడ్డీ రూపంలో కూడ పెట్టుబడిదారు లాభాన్ని పొందుతుంటాడు.

**సోషలిష్టు సమాజం / సోషలిజం –** పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా వచ్చిన సిద్ధాంతం. వర్గ రహిత సమాజం దీని లక్ష్యం. ఆ లక్ష్యం దిశగా పెట్టుబడి దారీ వ్యవస్థ లోనే సంస్కరణలకోసం కృషి చేస్తుంటారు.

## 13. భూమిపుత్రుడు

**బోడితలకు, మోకాలికి ముడిపెట్టడం –** సంబంధం లేని విషయాల మధ్య సమన్వయం కుదర్చాలని ప్రయత్నించడం.

**చిటికెల పందిళ్లు –** అరిచేతిలో స్వర్గం చూపించడం. ఆచరణకు దూరంగా ఉంటూ మాటల్లో గొప్పగా ఉండటం. పందిరి వేయాలంటే గుంజలు, తాళ్ళు, మొదలైనవి కావాలి. అలాకాకుండా చిటికెలో పందిరి వేస్తానని కొందరు గొప్పలు చెబుతుంటారు. వాళ్ళను బట్టి ఏర్పడిందే ఈ జాతీయం.

## 14. ధర్మదీక్ష

**గోధూళివేళ –** సాయం సమయం. ఆవులు పొలాల్లో గడ్డిమేసి ఇంటికి తిరిగి వచ్చే సమయం. ఆ సమయంలో గోవుల గిట్టల వల్ల ధూళి ఎగిసి శోభావహంగా ఉంటుంది.

**తీర్థప్రజ –** జాతరకు, ఉత్సవాలకు ఒకచోట గుమికుడిన ప్రజా సముదాయం.

**గౌతమబుద్ధుడు, తథాగతుడు, గౌతమ దేవుడు –** (క్రీ.పూ. 573-493) బౌద్ధ ధర్మ ప్రతిపాదకుడు. మాయా, శుద్ధోధనుల కుమారుడు. శాక్యముని, సిద్ధార్థుడు అనే ప్రసిద్ధ నామాంతరాలున్నాయి. యశోధరను వివాహమాడాడు. రాహులుడనే కుమారుడు కలిగినాడు. 'దుఃఖమయమయిన సాంసారిక జీవితం మీద విరక్తి చెంది సన్న్యాసం స్వీకరించాడు. సాంప్రదాయిక బోధనలతో శరీర శోషణ విధానాలతో తృప్తి చెందక స్వయంగా సంపూర్ణ జ్ఞానం పొంది బుద్ధత్వమందాడు. దుఃఖం, అనిత్య, అనాత్మ భావాలు బుద్ధుని ప్రవచన సారాంశాలుగా పరిగణిస్తున్నారు. ప్రాపంచిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వటం, కార్యకారణాత్మకంగా సమస్యలను పరిశీలించడం, దేవుని ప్రస్తావించక పోవడం బుద్ధుని విశేషం. అతని బోధనలద్వారా బౌద్ధ ధర్మము అభివృద్ధి చెందింది.

**యామము –** జాము అంటే మూడు గంటల కాలం, ఏడున్నర గడియల కాలం. గడియ అంటే 24 నిమిషాల కాలం.

**పంచప్రాణాలు –** ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలు; ప్రాణం = గాలి, వాయువు, హృదయమందలి గాలి; అపానం = పిత్తు (గుదం నుండి వెలువడే గాలి); వ్యానం = శరీరమంతటను వ్యాపించిన వాయువు; ఉదానం = కంఠమునందుండునట్టి వాయువు; సమానం = నాభియందలి వాయువు;.

**నవనాడులు –**

| <u>నాడులు</u> | <u>స్థానాలు</u> | <u>అధిదేవతలు</u> |
|---|---|---|
| ఇడ, | కుడి | శివుడు |
| పింగళ, | ఎడమ | విష్ణువు |
| సుషుమ్న, | మధ్యమ | బ్రహ్మ |
| గాంధార, | నేత్ర | ఇంద్ర |
| హస్తిని, | జిహ్వ | వరుణ |
| పుష (పూషా), | కుడి | దిగ్దేవత |
| పయస్విని, | ఎడమ | సద్యోద్భవుడు |
| అలంబస, | లింగ | వాయు |
| కుహు, | గుద | భూమి |

**నిర్వాణం –** బౌద్ధమతంలో ప్రాచుర్యం పొందిన పదం నిర్వాణం. మోక్షానికి సమానంగా ఈ పదాన్ని వాడతారు. నిశ్వసించటమని, చల్లారటమని, ఏమి లేకుండా పోవటమని, ఆర్పివేయటమని నిర్వాణానికి మరికొన్ని అర్థాలు. రాగ ద్వేష మోహాలు లేకుండా యోగ ముద్రతో సమాధి అవస్థలో ఉండటాన్నే నిర్వాణమన్నారు బౌద్ధులు. కామ క్రోధాదులు పూర్తిగా ఉపశమించిన అవస్థ నిర్వాణం. నింద్యమయిన కోరికలు, భావాలు, తృష్ణ వేదన, కామము – అన్నీ దానిలో నశిస్తాయి. శూన్యత, అనిమిత్త, అప్రణిహితాలు నిర్వాణ మార్గాలు. వాటి ద్వారా నిర్వాణం సిద్ధిస్తుంది. అర్హతుడు ఈ మూడు ద్వారాల ద్వారా ప్రయత్నించి నిర్వాణం పొందుతాడు. అర్హతావస్థనందుకొన్న వారికి పునర్జన్మ ఉండదు. బౌద్ధులు రెండు రకాల నిర్వాణాన్ని గుర్తించారు. ఉపాధి శేష నిర్వాణం, అనుపాధి శేష నిర్వాణం. ఉపాధిశేషనిర్వాణంలో రాగద్వేషాలు నిరోధితాలయిన వ్యక్తి జీవించే ఉంటాడు. పంచ స్కంధాలు పవిత్రరూపంలో ప్రకాశిస్తాయి. అనుపాధిశేష నిర్వాణంలో అమరత్వం శాంతి నిర్భయత్వం ఉంటాయి. దీనిలో వ్యక్తి మరణంతో బాటు స్కంధ జీవితం కూడ పూర్తవుతుంది. ఈ నిర్వాణంలో నాలుగు దశలున్నాయి. స్రోతాపన్నులు, సకృదాగాములు, అణగాములు, అర్హులు.

**క్రోశము –** రెండువేల విండ్ల పట్టు కొలది, కోసు.

*ఉపాధ్యాయుల బాధ్యత*

***పాఠశాల సమాజం యొక్క సూక్ష్మరూపం. సమాజంలోని అనేక వైవిధ్యాలు పాఠశాలలో కూడా ప్రతిబింబిస్తాయి. వైవిధ్యం ఒక సహజ దృగ్విషయం. ఈ సామాజిక వైరుధ్యాలను అభ్యసనను అడ్డంకిగాను, బలహీనతలను ఉపాధ్యాయులు భావించరాదు. పిల్లల విభిన్న నేపథ్యాలను, వారి భాషలను, కళలను, సంస్కృతులను బోధనావనరులుగా ఉపయోగించుకోగలగాలి. ఉపాధ్యాయులు పరిశోధకులుగా, ప్రతిస్పందిత సాధకులుగా, భాగస్వామ్య అభ్యాసకులుగా కీలక పాత్రను పోషించాలి.***

***– ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం – 2011***

© SCERT not to be republished